క్లుప్తంగా

డీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా సుమన్



డొంకేశ్వర్(ఆర్మూర్): ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా అధ్యక్షుడిగా డొంకేశ్వర్ మండల వాసి కండెల సుమన్ మహారాజ్ నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. డొంకేశ్వర్‌కు చెందిన వ్యక్తిని జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

త్యాగాలు ఒకరివి.. భోగాలు ఇంకొకరివి



నందిపేట్(ఆర్మూర్): తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో మంది త్యాగాలు చేస్తే, బోగాలు మాత్రం ఇంకొకరు అనుభవిస్తున్నారని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు గంగాధర్ విమర్శించారు. ఈమేరకు శుక్రవారం నందిపేట మండల డిప్యూటీ తహసీల్దార్ వసంత రావుకు వారు వినతిపత్రం అందజేశారు. దశాబ్ది సంబురాలలో రాష్ట్రం కోసం పోరాడిన ప్రజల ఆశలు, ఆకాంక్షల మాటేమిటని ప్రశ్నించారు. సంబురాలు అధికారంలో ఉన్నవారికే పరిమితమయ్యాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పరిపాలన కొనసాగాలని కోరారు. నాయకులు సాయరెడ్డి, రాజలింగం, దువన్న, మల్లయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట



బోధన్ రూరల్ (బోధన్): ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం శుక్రవారం బోధన్ మండలంలో కొనసాగింది. ఈసందర్భంగా ఊటీపల్లి ఉర్దూ మీడియం, బెల్లాల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ, బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఉచిత విద్య, భోజనం, ఆంగ్లంలో మాధ్యమ బోధన అందిస్తున్నామని తెలిపారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో శుక్రవారం బీజేపీ పట్టణశాఖ నాయకులు పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించే పంటలకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరను పెంచడంతో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశామని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నాయకులు కందికట్ల శ్రీనివాస్ నాయకులు హన్మండ్లు చారీ, భూమన్న, నర్సింలు, నరేందర్ ఉన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



బాల్కొండ: ముప్కాల్ మండలంలో వేంపల్లి, నాగంపేట్, కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ మాధవి మాట్లాడుతూ.. పిల్లలకు తల్లిపాలతో పాటు, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీమహాలక్ష్మీదేవి ఆలయ అభివృద్ధికి శుక్రవారం జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్, జెడ్పీటీసీ అంబర్‌సింగ్ రూ.21వేల విరాళాన్ని అందించారు. వైస్ ఎంపీపీ దశాగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్కెల సాయరెడ్డి, నర్సారెడ్డి, గంగారెడ్డి ఉన్నారు.

సబ్బండ కులాల సంక్షేమమే ధ్యేయం

- బోధన్ ఎమ్మెల్యే షకీల్
- ఘనంగా సంక్షేమ సంబురాలు



బోధన్‌లో పేదలకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్రంలోని సబ్బండ కులాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నాడని, తెలంగాణలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బోధన్‌లో సంక్షేమ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కరెంటు, సాగునీటి కష్టాలు లేని బంగారు తెలంగాణగా సీఎం మార్చాడని, బీసీ కులాలకు కుల వృత్తుల కోసం రూ. 1లక్ష ఆర్థిక సహాయం అందించాడన్నారు. గ్రామాల్లో హనుమాన్ ఆలయం లేని ఊరు ఉండదని అలాగే సీఎం కేసీఆర్ సంక్షేమ పథకం పొందని ఇళ్లు ఉండవన్నారు. బీఆర్ఎస్ పార్టీ విస్తరణలో భాగంగా మహారాష్ట్రకు వెళ్లినప్పుడు అక్కడ ఇలాంటి సంక్షేమ పథకాలు లేక రైతులు, ప్రజలు కన్నీటి గోసను వ్యక్తం చేశారన్నారు. బోధన్ నియోజకవర్గంలో ఏ ఇంటికైనా సంక్షేమ పథకం రాకాపోతే రాజీనామా చేస్తానని వెల్లడించారు. నిలువ నీడలేని నిరుపేదలకు పట్టణంలో 75గజాల చొప్పున 12వందల ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ఇళ్లు కట్టి ఇస్తామన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కులు, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తహసీల్దార్ వరప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, రవిందర్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, ఎంపీపీలు బుద్దె సావిత్రి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా సంక్షేమ పథకాలు

నవీపేట: రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే షకీల్ పునరుద్ఘాటించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని నందిగామ, కోస్లీ గ్రామాలలో శుక్రవారం గొర్రెలు, ఇళ్ల పట్టాల పంపిణీ, ఆరోగ్య ఉప కేంద్ర భవనం, కమ్యూనిటీ హాల్‌ల ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. కేసీఆర్ తలపెట్టిన పథకాలను మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో అమలు చేయాలని, బీఆర్ఎస్‌ను విస్తరింపజేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారని పేర్కొన్నారు. నందిగామ, కోస్లీలలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ సవిత, వైస్ ఎంపీపీ హరీష్, సర్పంచులు లావణ్య, నీలేష్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



నందిగామలో ఎమ్మెల్యేకు గొర్రెపిల్లను కానుకగా అందజేస్తున్న పెంపకందారులు

చేతి వృత్తులకు ప్రభుత్వం చేయూత

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్: బీసీ కులాల్లో చేతివృత్తుల మీద ఆధారపడి జీవించే పేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణాలు అందించి చేయూత ఇస్తుందని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సంక్షేమ సంబురాలను పట్టణంలోని క్షత్రీయ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని అయిదుగురు లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమైక్య పాలకుల పాలనలో నాడు సంక్షోభాన్ని చవిచూసిన తెలంగాణలో కేసీఆర్ పాలనతో నేడు సంక్షేమం వెల్లివిరుస్తోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినిత, జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, డాక్టర్ మధుశేఖర్, వైస్ చైర్మన్ మున్ను, కౌన్సిలర్లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఏం మేలు చేశారని ఉత్సవాలు!



బోధన్‌లో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి

బోధన్: తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు ఏమి మేలు చేశారని దశాబ్ది ఉత్సవాలు జరుపుతారని బీజేపీ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డె మోహన్‌రెడ్డిలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పట్టణంలోని శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే షకీల్ అభివృద్ధికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదని చేసిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు. బోధన్, ఎడపల్లి, నవీపేట రైల్వే ఆర్‌వోబీలకు కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. నియోజక వర్గంలో చేపట్టిన చెక్‌డ్యాంలు, నేషనల్ హైవే రోడ్ల నిర్మాణానికి రూ. కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని గుర్తు చేశారు. సొంత పార్టీ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రొటోకాల్ పాటించకుండా మహిళలను అగౌరవ పరుస్తున్నారని ఆరోపించారు. రైతుల ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామని వెల్లడించారు. నాయకులు సుధాకర్‌చారి, సంతోష్, రామరాజు, గుంత గంగాధర్, అశోక్‌గౌడ్ ఉన్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించాలి



బోధన్ డిపోలో మాట్లాడుతున్న అధికారులు

బోధన్: ఆర్టీసీ అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సంస్థకు, ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా ఉండాలని ఎంవీఐ యశ్వంత్ కుమార్ నూతనంగా నియామకమైన విలేజ్ బస్ ఆఫీసర్స్‌కు సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన విలేజ్ బస్ ఆఫీసర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని, సంస్థ మార్గదర్శకాలను ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని వారికి పేర్కొన్నారు. డీఎం టీఎన్ స్వామి మాట్లాడుతూ.. డిపోలో 32 మందిని విలేజ్ బస్ ఆఫీసర్స్‌గా నియమించామని, వీరు నెలకు రెండు సార్లు గ్రామాలకు వెళ్లి ప్రజల అవసరాలు, సమస్యలను తెలుసుకుంటారన్నారు.

ప్రయివేట్ వాహనాలకు దూరంగా ఉండాలి..

ఆర్మూర్‌టౌన్: ప్రయాణికులు ప్రయివేట్ వాహనాలకు దూరంగా ఉండి, ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని ఎంవీఐ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం విలేజ్ బస్ ఆఫీసర్ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా విలేజ్ బస్ ఆఫీసర్లకు ఎంవీఐ వెంకటస్వామి కిట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలేజ్ బస్ ఆఫీసర్లు సంస్థకు, ప్రజలకు మధ్య వారధిగా నిలబడి ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆర్మూర్ డిపో పరిధిలో 28 విలేజ్ ఆఫీసర్లను నియమించామన్నారు. డిప్యూటీ ఆర్ఎం పారు, డిపో మేనేజర్ కవిత, పృథ్వీరాజ్, సాయన్న, విలేజ్ బస్సు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



రుద్రూర్: మోస్రా శివారులోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం నల్ల పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలతో గ్రామాన్ని సుభీక్షంగా ఉంచాలని ప్రార్థించారు.

సీనియర్ అసిస్టెంట్ బదిలీ



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంటు గంగాధర్ పదోన్నతిపై నిజామాబాద్ మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం వైద్య సిబ్బంది గంగాధర్‌ను సన్మానించారు. పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ ఆమోదం





ఆర్మూర్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత.. నిరసన తెలుపుతున్న బీజేపీ కౌన్సిలర్లు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి, ఆమోదించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అధ్యక్షతనలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 71 అంశాలను బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఏకగ్రీవంగా ఆమోదించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణంలోని 36వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, కౌన్సిలర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ కౌన్సిలర్ల నిరసన

మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఒకే అంశం చదివి 71అంశాలను ఏకగ్రీవంగా తీర్మానం చేయడంపై బీజేపీ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. అలాగే బీజేపీ వార్డులకు రూ. 5లక్షలకు కేటాయించి, బీఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డులకు రూ. 10లక్షల నిధులను కేటాయించడం సరికాదన్నారు. మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతిపై కలెక్టర్ విచారణ జరపాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి, సాయి, కొంతం మంజుల డిమాండ్ చేశారు.

'బీసీ కులాల మధ్య చిచ్చు పెడుతున్నారు'



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు

ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం బీసీల్లో ఉన్న కులాల మధ్య చిచ్చు పెడుతోందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అబ్బగోని అశోక్‌గౌడ్ ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల్లో 130 కులాలు ఉండగా కేవలం 15కులాల వారికి మాత్రమే రూ.లక్ష ఆర్థిక చేయూతను ప్రకటించి మిగతా కులాల వారిని కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. బీసీల అభివృద్ధి కోసం బీసీ బంధును ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్ష రూపాయలతో కుల వృత్తులు చేసుకొనే వారికి పనిముట్లు కూడా రావన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విఠోబ, ప్రేమ పావని, దాసరి మూర్తి, వినోద్, శ్రావణ్, మహిపాల్, అర్జున్, నరేష్ పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠానకలాన్ గ్రామ శివారులో గల జానకంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములకు శుక్రవారం వేలం నిర్వహించారు. ఆలయానికి సంబంధించిన ఏడెకరాల భూమికి కౌలు కోసం వేలంపాట నిర్వహించగా రూ.2లక్షల 25వేలకు పలువురు రైతులు వేలం పాడి దక్కించుకున్నారు. ప్రతి ఏటా ఈ భూములకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలు భావితరానికి ప్రేరణ కావాలి



విద్యార్థుల వసతి భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాకతీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

బోధన్: స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు ఎంతో గొప్ప ఆశయాలతో అమలు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు భావితరానికి ప్రేరణగా నిలవాలని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బోధన్‌ప్రాంత కమ్మ సామాజికవర్గం ఏర్పాటు చేసిన కాకతీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు చదువు నిమిత్తం ఉచిత వసతి కోసం బాన్సువాడ వెళ్లె ప్రధాన రోడ్డుకు సమీపంలో మూడంతస్తుల ఆధునాతన భవనం నిర్మించారు. భవన ప్రారంభోత్సవం శుక్రవారం నిర్వహించగా, మండవ పాల్గొని మాట్లాడారు. సమాజం సుభిక్షంగా ఆరోగ్యవంతంగా ఉంటేనే ప్రతి ఒక్కరి జీవన స్థితిగతులు బాగుంటాయనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ప్రస్తుతం 34 మంది పాఠశాల స్థాయి విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతున్నారని, విద్యార్థుల సంఖ్య వందకు పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. మండవ సతీమణి ట్రస్ట్ చీఫ్ అడ్వయిజర్ నళినీ, కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని క్రిష్ణయ్య, బిల్డర్ ముమ్మలనేని రాజశేఖర్ పద్మ దంపతులు, ట్రస్ట్ చైర్మన్ పల్లెంపాటి శివన్నారాయణ, డీసీసీబీ డైరెక్టర్ శరత్, ప్రతినిధులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ, ఈనెల12న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసు పిలుపునిచ్చారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శుక్రవారం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50వేల పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపులో ఐఎఫ్‌టీయు శ్రేణులు చురుకుగా పాల్గొనాలని దాసు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాజాభాయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షుడు భానుచందర్, శ్రీను, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరుల హక్కులను సాధించుకుందాం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఉన్న వడ్డెర కులస్తులు అందరు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకుందామని వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణరాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న వడ్డెరుల కోసం హైదరాబాద్‌లో ఒక ఎకరం స్థలంలో ఆత్మగౌరవ భవనంలో విద్యార్థి వసతి గృహంలో మ్యారేజ్‌హాల్, గ్రంథాలయం, ప్రత్యేక గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం భూమిపూజ కార్యక్రమం ఉంటుందన్నారు. ట్రస్ట్ డైరెక్టర్స్ ఎత్తరి అంతయ్య, శంకర్, రాములు, ప్రసాద్, నాగేష్, రాజు తదితరులు ఉన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఎంపీ అర్వింద్, వ్యాపారవేత్త అంకాపూర్‌కు చెందిన పైడి రాకేష్‌రెడ్డి, వారి సతీమణిపై ఫొటోమార్ఫింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్ కుమార్, నాయకులు పాల్కం వేణు, ఖాందేశ్ ప్రశాంత్, పులి యుగంధర్, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	అనంత 11.10, కౌశిక్ శర్మ-1.10 స్పైడర్ మాన్(తెలుగు)-3.30 మేమ్ ఫేమస్ -6.35 పరేషాన్ -9.45
స్క్రీన్-2 –	ట్రాన్స్‌ఫార్మర్స్ -10.40, 1.35, 4.30, 7.25, 10.20
స్క్రీన్-3 –	టక్కర్ 12.20 , 6.30 ,9.30 మేమ్ ఫేమస్ 3.20
స్క్రీన్-4 –	అన్‌స్టాపబుల్ 10.35 7.00 ఇంటింటి రామాయణం 4.05 9.35

బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి



జక్రాన్‌పల్లిలో మాట్లాడుతున్న సూర్య శివాజీ

జక్రాన్‌పల్లి: బీడీ కార్మికులందరికీ రూ. రెండు వేల జీవన భృతి ఇవ్వాలని ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన బీడీ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 ఫిబ్రవరి 28నాటికి పీఎఫ్ ఉన్న వారికి మాత్రమే జీవన భృతి ఇస్తున్నారని తెలిపారు. 2019 సెప్టెంబర్ 17న కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కానీ ఇప్పటి వరకు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం ఇకనైన బీడీ కార్మికులకు జీవన భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీడీ కార్మికులతో కలిసి ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, గోదావరి, సాయమ్మ, లక్ష్మీ, రూప, గంగు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరాటాలకు సిద్ధం కావాలి



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల అమలు కోసం విద్యార్థులు, యువత పోరాటాలకు సిద్ధం కావాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, గణేష్‌లు అన్నారు. నగరంలోని గిరిరాజ్ కళాశాలలో శుక్రవారం దశాబ్ది ఉత్సవాలకు వ్యతిరేకంగా సెమినార్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మిక, కర్షక ప్రజా పోరాటాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. కానీ ఆ ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా ప్రస్తుతం పాలన నడుస్తుందన్నారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు, లేనియెడల మరోసారి అసెంబ్లీ, ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు అనిల్, కావ్య, శైలజ, నాగేష్, రంజాన్, వసీమ్, సలీమ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించండి



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

ఖలీల్‌వాడి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. స్టేషన్‌లోని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌ను శుభ్రంగా ఉంచినందుకు ఎస్సై పూర్ణేశ్వర్‌ను అభినందించారు.సీఐ వెంకట నారాయణ తదితరులు ఉన్నారు.